క్లుప్తంగా


స్విమ్మింగ్ పోటీల విజేతలకు బహుమతులు



విజేతలకు బహుమతులు అందిస్తున్న వరప్రసాద్ తదితరులు

మురళీనగర్: స్థానిక వైశాఖి స్పోర్ట్స్ పార్కులోని స్విమ్మింగ్ పూల్‌లో వైశాఖి స్పోర్ట్స్ పార్కు, డెకథ్లాన్ సంయుక్తంగా మంగళవారం నిర్వహించిన స్విమ్మింగ్ పోటీల్లో విజేతలకు బహుమతులు అందించారు. వైశాఖి స్విమ్మింగ్ పూల్‌లో శిక్షణ పొందిన వారితో పాటు నగరంలోని పలు ప్రాంతాల్లో శిక్షణ పొందిన స్విమ్మర్లు ఉత్సాహంగా పాల్గొన్నారు. వీరికి వైశాఖి స్పోర్ట్స్ పార్కు అధ్యక్షుడు సనపల వరప్రసాద్, డెకథ్లాన్ ప్రతినిధి మణికుమార్ ప్రశంసాపత్రాలు, బహుమతులు అందించారు. కార్యక్రమంలో పార్కు కార్యదర్శి పీవీ సూర్యనారాయణరాజు, ఉపాధ్యక్షుడు సీతిని సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

యోగసిద్ధాంజనేయుడికి ప్రత్యేక పూజలు



వడమాలతో యోగసిద్ధాంజనేయుడు

మురళీనగర్: జాతీయ రహదారి సూర్యానగర్‌లో వెలసిన యోగసిద్ధాంజనేయ స్వామి ఆలయంలో మంగళవారం ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకుడు ఆరవిల్లి శ్రీకాంతాచార్యులు ఆధ్వర్యంలో స్వామికి ఆగమ సాంప్రదాయంలో పూజలు చేశారు. సింధూరార్చన, తమలపాకుల పూజ నిర్వహించి స్వామికి వడమాల సమర్పించారు. స్వామి సన్నిధిలో భక్తులు సుందరాకాండ పారాయణ చేశారు. కార్యక్రమంలో ఆలయ వ్యవస్థాపకుడు పి.సుబ్బరాజు, ఆధ్యాత్మికవేత్త ఎంవీ రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా పైడా కళాశాల ఫేర్‌వెల్



స్టాప్ డ్రగ్స్ అంటూ విద్యార్థులు ప్రదర్శించిన నృత్య రూపకంలో ఒక దృశ్యం

దాబాగార్డెన్స్: పైడా డిగ్రీ కళాశాల ఫేర్‌వెల్ కార్యక్రమం మంగళవారం అల్లూరి విజ్ఞాన కేంద్రంలో ఉల్లాసంగా ఉత్సాహంగా సాగింది. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని విద్యార్థులు చేపట్టిన సాంస్కృతిక ప్రదర్శనలు.. నృత్యాలు ఆకట్టుకున్నాయి. ప్రతిభ గల, వివిధ అంశాల్లో గెలుపొందిన విద్యార్థులకు కళాశాల చైర్మన్ పైడా కృష్ణప్రసాద్ బహుమతులు, మెరిట్ సర్టిఫికెట్లు అందజేశారు. ప్రిన్సిపాల్ డాక్టర్ డి. సరోజ్ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో ఏయూ రెక్టార్ ప్రొఫెసర్ ఎన్. కిషోర్‌బాబు, కళాశాల అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

తైక్వాండోలో జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక



విజేతలను అభినందిస్తున్న కళాశాల సెక్రటరీ మధుకుమార్

సీతంపేట: తెనాలిలో జరిగిన రాష్ట్ర స్థాయి ఖేలో ఇండియా తైక్వాండో సిటీ లీగ్ చాంపియన్ షిప్ పోటీల్లో బుల్లయ్య ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థిని కె.మౌనిక 67 కిలోల విభాగంలో బంగారు పతకం సాధించి, ఉత్తరాఖండ్‌లో జరగనున్న జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైంది. అలాగే పార్వతీపురం మన్యం జిల్లాలో నిర్వహించిన 31వ మిస్టర్ ఆంధ్రా బాడీ బిల్డింగ్ రాష్ట్ర స్థాయి పోటీలలో ఇంజినీరింగ్ ఫైనలియర్ విద్యార్థి కె.బాలు 60 కిలోల విభాగంలో రజత పకతం సాధించాడు. ఈ సందర్భంగా కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ జి ఈమధు కుమార్ వారిని అభినందించారు. కళాశాల ప్రిన్సిపాల్ దీపక్ చౌదరి, వ్యాయామ విభాగాధిపతి వై.శ్రీనివాసరావు పాల్గొన్నారు.



శంకువానిపాలెం పార్కులో తాళ్లు కట్టి బట్టలు ఆరబెట్టిన రజకులు



పచ్చదనం లేక వెలవెలబోతున్న వాకింగ్ ట్రాక్



80 అడుగుల రోడ్డులో వార్డు కార్యాలయం తొలగించడంతో ఖాళీగా దర్శనమిస్తున్న స్థలం


అసంపూర్తి పనులు.. పూర్తయ్యేనా?

- ఎన్నికల కోడ్ కారణంగా గత ప్రభుత్వ హయాంలో మధ్యలో నిలిచిపోయిన అభివృద్ధి పనులు
- వాటిపై దృష్టి సారించని కూటమి ప్రభుత్వం
- గత ప్రభుత్వంలో చేపట్టిన అభివృద్ధిపై కానరాని నిర్వహణ
- మందుబాబులకు అడ్డాగా శంకువానిపాలెం పార్కు
- మొక్కలు నాటకుండా వదిలేసిన అక్కయ్యపాలెం మెయిన్ రోడ్డులోని సెంటర్ మీడియన్
- కళావిహీనంగా పార్కులు, వాకింగ్ ట్రాక్‌లు, జంక్షన్లు

సీతంపేట: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి తొమ్మిది నెలలు గడిచినా ఒక్క సంక్షేమ పథకం గానీ, అభివృద్ధి పని గాని చేపట్టలేదు. ఎన్నికల ముందు సూపర్ సిక్స్ హామీలంటూ ఊదరగొట్టి ప్రజలను మభ్యపెట్టారు. తీరా గెలిచాక వాటిని అటకెక్కించారు. గత ప్రభుత్వం అభివృద్ధి ఏమీ చేయలేదని దుష్ప్రచారం చేసిన కూటమి నాయకులు అధికారంలోకి వచ్చాక ఎటువంటి అభివృద్ధి పనులు చేపట్టారో వారికే తెలియాలి. కనీసం గత ప్రభుత్వంలో చేపట్టిన అభివృద్ధి పనుల నిర్వహణ సైతం గాలికి వదిలేసారు. దీంతో పార్కులు, వాకింగ్ ట్రాక్‌లు, జంక్షన్లు కళావిహీనంగా మారాయి. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఉత్తర నియోజకవర్గంలో కోట్లాది రూపాయల విలువైన రహదారులు, పార్కులు, ఓపెన్ జిమ్‌ల బ్యూటిఫికేషన్, బస్ షెల్టర్లు, జంక్షన్ల బ్యూటిఫికేషన్, ఫుట్‌పాత్‌లు, ఆసుపత్రులు, స్కూల్స్ వంటి ఎన్నో అభివృద్ధి పనులు అన్ని వార్డుల్లో చేపట్టారు. కొన్ని అభివృద్ధి పనులు జరుగుతుండగా ఎన్నికల కోడ్ రావడంతో పనులు సగంలో నిలిచిపోయాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నిలిచిపోయిన అభివృద్ధి పనులు పూర్తి చెయ్యాల్సిన బాధ్యత ఉన్నా వాటివైపు కన్నెత్తి చూడటం లేదు. ఫలితంగా కోట్లాది రూపాయల ప్రజాధనం నిరుపయోగంగా మారింది. ఇప్పటికైనా గత ప్రభుత్వంలో చేపట్టిన అభివృద్ధి పనులను పూర్తి చేసి, నిర్వహణ మెరుగుపర్చి ప్రజలకు అందుబాటులోకి తేవాలని ప్రజలు కోరుతున్నారు.



అక్కయ్యపాలెం మెయిన్‌రోడ్‌లో మొక్కలు నాటకుండా వదిలేసిన సెంటర్ మీడియన్



శంకువానిపాలెం పార్కులో తాగి పడేసిన మందు బాటిళ్లు

- జీవీఎంసీ 26వ వార్డు శంకువానిపాలెంలో రూ.16.30 లక్షల వ్యయంతో పార్కును అభివృద్ధి చేసారు. వాకింగ్ ట్రాక్ నిర్మించి , కూర్చోవడానికి సిమెంట్ బెంచీలు ఏర్పాటు చేశారు. ఎన్నికల కోడ్ కారణంగా పార్కులో మొక్కలు నాటడం, గ్రీనరీ అభివృద్ధి పనులు, విద్యుత్ దీపాలు అమరిక వంటి పనులు నిలిచి పోయాయి. కూటమి ప్రభుత్వం వచ్చాక వాటిని చేపట్టాల్సి ఉండగా , కనీసం పార్కు నిర్వహణ కూడా చేపట్టలేకపోయింది. ఫలితంగా పార్కు ఆకతాయిలకు, మందుబాబులకు అడ్డాగా మారింది. సిమెంట్ బెంచీలు విరిగిపోయాయి. పార్కులో తాళ్లు కట్టి బట్టలు ఆర బెట్టుకుంటున్నారు.



సత్యం సెంటర్ వద్ద ఫెన్సింగ్ ధ్వంసమైన వాకింగ్ ట్రాక్

- జీవీఎంసీ 25వ వార్డు పరిధిలో సత్యం సెంటర్ వద్ద గ్రీన్ బెల్ట్ ప్రాంతాన్ని వాకింగ్ ట్రాక్, ఓపెన్ జిమ్‌తో పార్కుగా అభివృద్ధి చేసి మొక్కలు నాటారు. కూటమి ప్రభుత్వంలో నిర్వహణ లేక పచ్చదనం మాయమైంది. పార్కుకు రక్షణగా ఉన్న ఫెన్సింగ్ ధ్వంసమైంది. విద్యుత్ దీపాలు లేక చీకట్లు అలుముకుంటున్నాయి. దీంతో రాత్రి అయితే వాకింగ్‌కు వెళ్ళడానికి ఎవరూ ఆసక్తి చూపడం లేదు.
- జీవీఎంసీ 43వ వార్డు పరిధి 80 అడుగుల రోడ్డులో వార్డు కార్యాలయ భవనం ఉండేది. పాత భవనాన్ని తొలగించి కొత్త భవనం నిర్మించడానికి నిధులు మంజూరు చేశారు. పాత భవనాన్ని తొలగించిన తర్వాత ఎన్నికల కోడ్ రావడంతో కొత్త భవన నిర్మాణ పనులు నిలిచిపోయాయి. కూటమి ప్రభుత్వం ఏర్పడి తొమ్మిది నెలలు గడిచినా భవన నిర్మాణ పనులు ముందుకు సాగడం లేదు.

- జీవీఎంసీ 26, 27, 43, 44 వార్డుల పరిధిలో ఉన్న అక్కయ్యపాలెం మెయిన్‌రోడ్‌ను రూ.12 కోట్ల వ్యయంతో విస్తరణ చేపట్టారు. దీనిలో భాగంగా హైవే నుంచి మహారాణి పార్లర్ వరకు 80 అడుగుల రహదారిగా, మహారాణి పార్లర్ నుంచి దొండపర్తి జంక్షన్ వరకు 60 అడుగుల రహదారిగా విస్తరించి ఫుట్‌పాత్‌లు నిర్మించారు. హైవే నుంచి మహారాణి పార్లర్ కూడలి వరకు సెంటర్ మీడియన్ నిర్మించి వీధి దీపాలు అమర్చారు. అయితే సెంటర్ మీడియన్‌పై మొక్కలు నాటాల్సి ఉంది. ఆ పనులు ఇప్పటికీ మొదలు కాలేదు. అలాగే మహారాణి పార్లర్ కూడలిలో వాటర్ ఫౌంటైన్ నిర్మించి అందంగా తీర్చిదిద్దారు. నిర్వహణ లేక కొద్ది నెలలుగా ఫౌంటైన్ పని చెయ్యడం లేదు.

నిర్వహణపై దృష్టి సారించండి..

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి సంక్షేమం, అభివృద్ధికి ప్రాధాన్యం ఇచ్చింది. ఎన్నికల మ్యానిఫెస్టోను శతశాతం అమలు చేసింది. ప్రతి వార్డులో రోడ్లు, డ్రెయిన్లు, కల్వర్టులు, పార్కులు, ఓపెన్ జిమ్‌లు, వాకింగ్ ట్రాక్‌లు నిర్మించారు. కూటమి ప్రభుత్వం వచ్చాక వాటి నిర్వహణను పట్టించుకోలేదు. ఫలితంగా ప్రజాధనం వృథా అవుతోంది.

– జి. రామారావు, అక్కయ్యపాలెం

అసంపూర్తి పనులు పూర్తి చేయండి..

గత ప్రభుత్వంలో ఎన్నో అభివృద్ధి పనులు చేపట్టారు. ఎన్నికల కోడ్ వల్ల కొన్ని పనులు సగంలో నిలిచిపోయాయి. వాటిని పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తేవాల్సిన బాధ్యత కూటమి నాయకులపై ఉంది. కొత్తవి ఎలాగూ చేయడంలేదు. సగంలో ఉన్న వాటినైనా పూర్తి చేసి అందుబాటులోకి తేవాలి.

– ఎస్.సన్యాసినాయుడు, అక్కయ్యపాలెం.

పాలిటెక్నిక్‌కు కట్ మోడల్ ఇంజిన్ వితరణ



సమావేశంలో మాట్లాడుతున్న కెన్నడీ

మురళీనగర్: కంచరపాలెం ప్రభుత్వ పాలిటెక్నిక్ మెకానికల్ ఇంజినీరింగ్ విభాగంలో విద్యార్థుల ప్రయోగాలకు ఉపయోగపడేందుకు ఇసుజు మోటార్స్ ఇండియా ప్రైవేటు లిమిటెడ్ కంపెనీ కట్ మోడల్ డీజిల్ ఇంజిన్‌ను వితరణ చేసింది. ఈమేరకు ప్రిన్సిపాల్ డాక్టర్ కె.నారాయణరావు అధ్యక్షతన మంగళవారం నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో కంపెనీ మానవ వనరుల విభాగం జనరల్ మేనేజర్ కెన్నడీ డీజిల్ ఇంజిన్‌ను అందజేశారు. ఈ సందర్భంగా కెనడీ మాట్లాడుతూ ఇసుజు మోటార్స్ కంపెనీ అంతర్జాతీయంగా వందేళ్ల చరిత్ర కలిగిందన్నారు. కంపెనీ సామాజిక సేవా కార్యక్రమాల్లో భాగంగా పాలిటెక్నిక్ విద్యార్థులు ప్రయోగాత్మక విజ్ఞానాన్ని పొందేందుకు వీలుగా ఇంజిన్ అందజేశామన్నారు. కంపెనీ లీగల్ డిపార్టుమెంట్ సీనియర్ మేనేజర్ శుక్లా మాట్లాడుతూ విద్యార్థులు తాము నిర్దేశించుకున్న లక్ష్యాలను సాధించేందుకు ఇష్టంతో కష్టపడాలన్నారు. హెచ్‌ఆర్ మేనేజర్ నరేష్ మాట్లాడుతూ ప్రాక్టికల్ నాలెడ్జ్ ఉన్నవారికి మాత్రమే ఉద్యోగాల్లో ప్రాధాన్యత ఉంటుందన్నారు. సమావేశంలో ప్రిన్సిపాల్ డాక్టర్ కె.నారాయణరావు, మెకానికల్ హెడ్ మధుకుమార్, మెకానికల్ బ్రాంచ్ సిబ్బంది పాల్గొన్నారు.

పోక్సో చట్టంపై విద్యార్థులకు అవగాహన



విద్యార్థులకు పోక్సో చట్టంపై అవగాహన కల్పిస్తున్న ఏజేసీజే న్యాయమూర్తి గంగాభవాని

సీతమ్మధార: పిల్లలపై లైంగిక వేధింపులకు పాల్పడితే నిందితులకు జైలు శిక్ష, జరిమానా విధిస్తామని ఏజేసీజే న్యాయమూర్తి గంగాభవాని పేర్కొన్నారు. ఈ మేరకు మంగళవారం ద్వారకానగర్‌లోని సన్ ఇంటర్నేషనల్ ఇన్‌స్టిట్యూట్‌లో పోక్సో చట్టంపై విద్యార్థులకు వివరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నేటి యువత సెల్‌ఫోన్లకు ఎక్కువ ఆకర్షితులై ఉపయోగపడని విషయాల పట్ల ఆసక్తి చూపుతున్నారన్నారు. విద్యార్థులు సరైన మార్గంలో నడుస్తూ తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు సూచనలు పాటించాలన్నారు. పోక్సో కేసు నమోదైతే కనీసం ఐదేళ్ల నుంచి ఏడేళ్ల వరకు జైలు శిక్ష పడుతుందన్నారు. మహిళల పట్ల అసభ్యకరంగా వ్యవహరిస్తే కఠినమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని సూచించారు. విద్యార్థి దశలో చదువుపై ఏకాగ్రత చూపాలని, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు చెప్పినట్టు నడుచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ద్వారకా సీఐ డీవీ రమణ, కళాశాల విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

క్యాంపస్ డ్రైవ్‌లో గైస్ విద్యార్థులకు ఉద్యోగాలు



విద్యార్థులకు నియామక పత్రాలు అందిస్తున్న గైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ రమణ, కంపెనీ ప్రతినిధులు

మురళీనగర్: కంచరపాలెం ప్రభుత్వ కెమికల్ ఇంజినీరింగు ఇనిస్టిట్యూట్ (గైస్)లో గుజరాత్‌కు చెందిన నారాయణ ఎనర్జీ లిమిటెడ్ కంపెనీ నిర్వహించిన క్యాంపస్ ఇంటర్వ్యూల్లో ఉద్యోగాలు సాధించినట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వెంకటరమణ చెప్పారు. కాలేజీకి చెందిన ఆరుగురు విద్యార్థులకు రూ.4.50 లక్షల వార్షిక జీతంతో ఉద్యోగానికి ఎంపిక చేశారని తెలిపారు. వీరిలో పెట్రో కెమికల్ నుంచి ఇద్దరు, కెమికల్ ఇంజినీరింగు నుంచి నలుగురు విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికయ్యారు. ఎంపికైన విద్యార్థులకు ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వెంకటరమణ, నారాయణ ఎనర్జీ లిమిటెడ్ కంపెనీ హెచ్‌ఆర్ హెడ్ అమిత్రజిత్ సేన్ గుప్తా నియామక పత్రాలు అందించారు. కార్యక్రమంలో కంపెనీ టెక్నికల్ హెడ్ రమణ వర్మ, హెచ్‌ఆర్ మేనేజర్ శ్రీస్తి శుక్ల, గైస్ విభాగాధిపతులు జయప్రకాష్‌రెడ్డి, ప్రశాంత కుమారి, దామోదర్, విజయలక్ష్మి, అసిస్టెంట్ టీపీవో కుమార్ తదితరులు పాల్గొన్నారు.

గంగవరం పోర్టును సందర్శించిన డీఆర్‌ఎం



గంగవరం పోర్టులో తనిఖీలు నిర్వహిస్తున్న డీఆర్‌ఎం లలిత్‌బోరా

తాటిచెట్లపాలెం: వాల్తేర్ డివిజన్, డివిజనల్ రైల్వే మేనేజర్ లలిత్ బోరా ఉన్నతస్థాయి అధికారుల బృందంతో కలిసి మంగళవారం అదాని గంగవరం పోర్టును సందర్శించి, తనిఖీలు నిర్వహించారు. పోర్టులో జరుగుతున్న పలు అభివృద్ధి పనుల ప్రాజెక్టులు, కీలక ప్రాంతాలను పరిశీలించారు. అనంతరం అదాని గంగవరం పోర్టు సీఈవో అమిత్ మాలిక్‌తో సమావేశమై పలు అంశాలపై చర్చించారు. వ్యాపారాభివృద్ధి కోసం చేపట్టవలసిన విషయాలు, ఇరువురి మధ్య అనుసరించాల్సిన వ్యూహాలు చర్చించి, రైల్వే అధికారులు పలు సూచనలు కూడా చేశారు. తనిఖీలలో డీఆర్‌ఎంతో పాటు సీనియర్ డివిజనల్ ఆపరేషన్స్ మేనేజర్ తన్మయ్ ముఖోపాధ్యాయ్, సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ సందీప్, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

మటన్ షాపులకు జరిమానా



ఐటీఐ కూడలిలో మటన్ దుకాణ యాజమానిపై కేసు నమోదు చేస్తున్న పబ్లిక్ హెల్త్, వెటర్నరీ అధికారులు



సాక్షి కథనంతో ముద్రతో మటన్ విక్రయాలు

సాక్షి ఎఫెక్ట్..

కంచరపాలెం: నియోజకవర్గ పరిధిలో మటన్ షాపుల నిర్వాహకులు నిబంధనలు పాటించడం లేదు. ఇష్టానుసారం విక్రయాలు జరుపుతున్నారు. మేకలు, గొర్రెల మాంసానికి జీవీఎంసీ ముద్ర ఉండాలి. అయితే చాలా మంది ఈ ముద్ర లేకుండానే అమ్మకాలు చేస్తున్నారు. విక్రయిస్తున్న చోట వాటిని వధించి అమ్మకాలు నిర్వహిస్తున్నారు. దీనిపై ఈ నెల 24న 'సాక్షి' దినపత్రికలో 'ముద్రలేని ముక్క.. వ్యాధులు పక్కా' అనే శీర్షికన కథనం వెలువడింది. దీనిపై పబ్లిక్‌హెల్త్, అండ్ వెటర్నరీ అధికారులు మంగళవారం స్పందించారు. ఆయా దుకాణాలను పరిశీలించి ప్రభుత్వ ముద్ర గల మాంసాన్ని విక్రయించాలని మటన్ వ్యాపారులను ఆదేశించారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించిన వ్యాపారులకు సుమారు రూ.35 వేల వరకు అపరాధ రుసుం వసూలు చేసినట్లు తెలిపారు.

ఏయూ ఆస్తుల పరిరక్షణ అందరి బాధ్యత

విశాఖ విద్య: ఆంధ్ర యూనివర్సిటీ ఆస్తులెక్కడున్నాయనేది తెలుసుకునేందుకు వైస్ చాన్సలర్ ఆచార్య రాజశేఖర్ మంగళవారం క్షేత్రస్థాయిలో పర్యటించారు. రిజిస్ట్రార్ ధనుంజయరావు, రెక్టార్ కిశోర్ బాబు సంబంధిత విభాగాల అధికారులతో కలిసి శివాజీ పాలెంలోని ఏయూ మహిళా ఇంజినీరింగ్ కళాశాల, ఫైన్ ఆర్ట్స్ కాలేజీలను సందర్శించారు. ఆయా ప్రాంగణాల్లో విద్యార్థులు వేసిన శిల్పాలు, వివిధ కళాకృతులను తిలకించారు. శివాజీ పాలెంలో ఉన్న వర్సిటీ ఆచార్యుల నివాస సముదాయాలను, ఇంజినీరింగ్ విద్యార్థినుల వసతి గృహాన్ని పరిశీలించారు.

అదే విధంగా ఇంజినీరింగ్ కాలేజీ మైదానం అంతా చూసి, వాటికి సరిహద్దులు ఎక్కడున్నాయనేది సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఏయూ ఆస్తుల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ బాధ్యత తీసుకోవాలని ఈ సందర్భంగా సూచించారు.

గెడ్డల నిర్వహణ అధ్వానం



మధురానగర్‌లో ఆంజనేయస్వామి ఆలయ సమీపంలో వంతెన వద్ద చెత్త కుప్పలు



ఆంజనేయస్వామి ఆలయం పక్కన గెడ్డలో పేరుకుపోయిన వ్యర్థాలు



పద్మశాలి భవనం పక్కన గెడ్డలో పేరుపోయిన పూడిక

సీతంపేట: అధికారుల పర్యవేక్షణ కొరవడడంతో వార్డుల్లో పారిశుధ్య నిర్వహణ అధ్వానంగా మారింది. స్థానిక మధురానగర్ రోడ్‌లో ఆంజనేయస్వామి ఆలయం వద్ద గెడ్డలో వ్యర్థాలు పెద్ద ఎత్తున పేరుకుపోయాయి. అలాగే గెడ్డపై రాకపోకలు సాగించే బ్రిడ్జిపై ఇరువైపులా చెత్త కుప్పలు రోత పుట్టిస్తున్నాయి. పద్మశాలి భవనం పక్కన ఉన్న గెడ్డలో చెత్తా చెదారం పెద్ద ఎత్తున నిలిచిపోయింది. దీంతో మురుగునీటి ప్రవాహానికి ఆటంకాలేర్పడి దోమలు వృద్ధి చెందుతున్నాయి. గెడ్డల నిర్వహణ సరిగా లేదని, చాలా కాలంగా గెడ్డల్లో పూడికలు తొలగించలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. చెత్త తరలించక పోవడంతో బ్రిడ్జిపై రాకపోకలకు ఇబ్బందిగా మారిందని , గెడ్డల్లో పూడికల వల్ల రోత పుట్టిస్తున్నాయని నివాసితులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.